దుస్థితిలో జలదంకి బస్టాండ్


కనీస వసతులు లేని జలదంకి ఆర్టీసీ బస్టాండ్


ఫ్లెక్సీలతో నిండిపోయిన జలదంకి బస్టాండ్ ప్రాంగణం

- కనీస వసతులు కరువు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

జలదంకి: జలదంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసే స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం కావలి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, కడప, బెంగళూరు తదితర ప్రాంతాలకు జలదంకి మీదుగా బస్సులు వెళుతుంటాయి. బస్టాండ్ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి దుర్వాసనతో ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రయాణికులకు వివరాలు తెలిపేందుకు కంట్రోలర్ రూమ్ ఉన్నా దానికి తాళం వేసేశారు. తాగునీటి కుళాయిలు ఉన్నా వాటి నుంచి చుక్కనీరు వచ్చిన దాఖలాలు లేవు. బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఫర్నిచర్ గానీ, బస్సుల వేళలు తెలిపే పట్టికలు గానీ లేవు.

అభివృద్ధిపై నిర్లక్ష్యం

జలదంకిలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్నా బస్టాండ్ అభివృద్ధిపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో మహిళా ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లాలంటే హడలిపోతున్నారు. ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడుతుండడంతో బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా రోడ్డుపైనే కొద్దిసేపు నిలిచి వెళ్లిపోతున్నాయి. దీనికితోడు బస్టాండ్ ప్రాంగణం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలతో నిండిపోవడం గమనార్హం. ఆర్టీసీ అధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలగించి బస్టాండ్‌లో సౌకర్యాలను మెరుగుపరచాలని, బస్సులన్నీ బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్టాండ్ ప్రాంగణంలో తాళం వేసిన కంట్రోలర్ గది


మరుగుదొడ్లు ఉన్న ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తచెదారం

తహసీల్దార్‌కు ఫిర్యాదు

సోమశిల: మండలంలోని బొమ్మవరం అగ్రహారం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో మిగిలి ఉన్న రెండు ప్లాట్లను కొందరు నకిలీ పట్టాలు తయారు చేసుకుని సొంతం చేసుకున్నారంటూ మంగళవారం అనంతసాగరంలో ఇన్‌చార్జి తహసీల్దార్ గిరీష్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన ఆయన విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

11న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 11న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్నిశాఖల పరంగా చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

నీటి సరఫరా లేక అవస్థలు

కావలి: పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీ పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా నీటి సరఫరాను మున్సిపాలిటీ నిలిపేసింది. కుళాయిల్లో నీరు ఎందుకు రావడం లేదో ప్రజలకు సమాచారం లేదు. మున్సిపల్ అధికారులు ఎప్పుడు నీరు వదులుతారా అని ఉదయం నుంచి సాయంత్రం వరకు కుళాయిలను గమనిస్తూ ఆశగా ఎదురు చూస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. నీటి సరఫరాపై మున్సిపల్ సిబ్బందిని అడుగుతున్నా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పార్వతీదేవికి శాకంబరి అలంకారం



ఆత్మకూరు: పట్టణంలోని పంటవీధి రామాలయంలో ఉన్న పార్వతీదేవి ఆలయంలో ఆషాడమాస మంగళవారాన్ని పురస్కరించుకొని అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు జాగర్లపూడి నాగరాజశర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అమ్మవారి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



మర్రిపాడు: మండలంలోని చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ కృష్ణపాటి వెంకటరమణారెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం వెంకటరమణారెడ్డిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులకు కృతజ్ఞతలు


డీఎస్పీ కోటారెడ్డి, ఎస్సైలను సన్మానిస్తున్న హనుమాన్ కమిటీ సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 21వ తేదీన తొలిసారిగా నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర విజయవంతమయ్యేందుకు సహకరించిన డీఎస్పీ ఎస్.కోటారెడ్డి, సీఐ జి.వేణు, ఎస్సై ముత్యాలరావులతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి హనుమాన్ భక్త బృందం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం ఆత్మకూరులోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని, విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో డీఈఈ జనార్దన్, ఏడీఈ సురేష్ తదితరులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఎన్ఎంయూఏ నాయకుడు కె.రమణరాజు కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దూరప్రాంత సర్వీసులను పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు చేపట్టాలన్నారు. డిపోలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, మురళీమోహన్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, బి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి



ఆత్మకూరురూరల్: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మహిమలూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ దేవానంద్ సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని రామస్వామిపల్లిలో ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జ్వరపీడితులు ఎవరైనా ఉంటే తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌బాషా, సూపర్‌వైజర్ సైదా, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో గంగమ్మ తల్లి


డ్రైఫ్రూట్స్ అలంకారంలో గంగమ్మ తల్లి

సంగం: స్థానిక తూర్పువీధి గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో గంగమ్మకు గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి గంగపెట్టెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి వద్ద ఉంచారు. అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, తప్పెట్లు, తాళాల చప్పుళ్ల మధ్య అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు వీరతాళ్లతో విన్యాసాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

డ్రైఫ్రూట్స్ అలంకారంలో..

గంగమ్మ తల్లి జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి


బీసీ బాలుర హాస్టల్ వంటశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: పేద విద్యార్థులు ఆశ్రయం పొందే సంక్షేమ హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆత్మకూరు అర్బన్ వైద్యశాల డాక్టర్ షేక్ అస్మా సూచించారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ఆమె సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థుల కోసం ఏ మేరకు ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను హాస్టళ్లలో ఉంచి చదివిస్తుంటారని, అదే క్రమంలో ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, అవి సద్వినియోగమయ్యేలా చూసే బాధ్యత సిబ్బందిదేనని తెలిపారు. కలుషిత వాతావరణం హాస్టళ్లలో లేకుండా చూసుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది సుధాకర్, ఏఎన్ఎంలు బీబీజాన్, నూర్‌జహాన్, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, అనిత తదితరులు ఉన్నారు.

బదిలీ అయిన తహసీల్దార్లకు ఘన సన్మానం


వరికుంటపాడు: తహసీల్దార్ అరుణాదేవిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది


దుత్తలూరు : తహసీల్దార్ యశోదను సన్మానిస్తున్న సిబ్బంది

వరికుంటపాడు: వరికుంటపాడు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న కోనంకి అరుణాదేవి బదిలీపై విజయవాడ సీఆర్‌డీఏకు వెళ్తున్న క్రమంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. మండల ప్రజలకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ చెంచయ్య, ఆర్ఐ సాయికిరణ్, జూనియర్ అసిస్టెంట్ సుభాని, వీఆర్వోలు కొండయ్య, రమణయ్య, పిడుగు చెన్నకేశవులు, శేషారెడ్డి, మురళి, పిడుగు ఆదినారాయణ, బొగ్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: దుత్తలూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆర్.యశోద పల్నాడు జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొద్దినెలల కాలంలోనే ఆమె మండలంలో మంచిపేరు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఎం.శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ గులాం, వీఆర్వోలు, వీఏఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'హంస' నూతన కార్యవర్గం ఎంపిక



ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆత్మకూరు తాలుకా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ సూచనల మేరకు హంస ఆత్మకూరు తాలుకా కార్యవర్గాన్ని పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ నారాయణరాజు తెలిపారు. అధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా వి.జ్యోతి, సలోమి, ఎస్‌డీ మున్వర్ సుల్తాన్, మంజులమ్మ, వి.ధనకుమారి, ఎ.పృథ్వీ, పి.సింధూర, సీహెచ్ శిరీష, జె.నాగరాజు, జి.వెంకట్రావు, ఎస్.జయంతి, సీహెచ్ నాగమణి, డి.మస్తాన్‌లను తాలుకా కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జలీల్ అహమ్మద్, రాజు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, వైద్యులు ఆర్.మునికృష్ణ, పీవీ నరసింహాశాస్త్రి, రామనాథరెడ్డి, దత్త ప్రసాద్‌రెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా


మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

ఆత్మకూరు: ప్రధానమంత్రి జేజేవై, ప్రధానమంత్రి ఎస్‌బీవై బీమా పథకాలతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఈ పథకాలపై పొదుపు మహిళలు, మెప్మా సిబ్బంది ముమ్మర ప్రచారం చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మంగళవారం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి మెప్మా సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు లేదా సాధారణ మరణాలకు ప్రధానమంత్రి బీమా పథకాలు రెండు ఏర్పాటు చేశారని, అతి తక్కువ ప్రీమియంతో పేద కుటుంబాలకు ప్రమాదాల అనంతరం ఆ వ్యక్తుల మీద ఆధారపడే వారికి ఆర్థిక భరోసా కల్పించేలా రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి, బ్యాంక్ మేనేజర్ బీఎల్ సురేంద్ర, ఆర్పీలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగ పిల్లలకు మేలు


దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు చాముండేశ్వరి

సీతారామపురం: ఫిజియోథెరపీతో దివ్యాంగ పిల్లలకు మేలు జరుగుతుందని ఎంఈఓ మస్తాన్‌వలి పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపును పరిశీలించారు. ప్రతి మంగళవారం భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలతో చేయించే వ్యాయామాలు వారు సాధారణ జీవనం గడిపేందుకు దోహదపడతాయన్నారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు విద్యనందించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది కూడా ఉన్నందున భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరి, ఎంఆర్‌సీ సిబ్బంది, ఐఈఆర్‌టీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నారసింహాపురంలో 104 వైద్యసేవలు



వరికుంటపాడు: మండలంలోని నారసింహాపురం గ్రామంలో మంగళవారం వైద్యసిబ్బంది 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా 26 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

శ్మశానం ఆక్రమించారని ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు గ్రామ పంచాయతీ మజరా శ్రీనివాసపురం ఎస్సీ కాలనీ వాసులు మృతదేహాల ఖనానికి వినియోగిస్తున్న శ్మశానాన్ని గ్రామానికి చెందిన కుండి పెంచలరావు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానం ఆక్రమణపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. శ్మశానంలో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌ను కోరారు.

డెంగీ, డయేరియాపై అవగాహన సదస్సు


విష జ్వరాల వ్యాప్తిపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్

జలదంకి: మండలంలోని చామదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ, డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.హరిప్రసాద్ దోమలు, అతిసార నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు, మంచినీటి నిల్వల్లో మలేరియా, డెంగీ, బోధకాలు, మెదడువాపును వ్యాప్తి చేసే దోమలు ఆవాసం ఏర్పాటు చేసుకుని వ్యాధులను వ్యాప్తి చేస్తాయని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తే దోమల వల్ల వచ్చే విషజ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, హెచ్ఎం డి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు మాల్యాద్రి, సలీం, ఆరోగ్య కార్యకర్త షాహీదా, ఆశా కార్యకర్తలు తిరుపతమ్మ, నాగమణి, పద్మావతి, ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

వింజమూరు(ఉదయగిరి): సమాజంలో బాలికలపై జరుగుతున్న వేధింపులు, చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి మంగళవారం వింజమూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో సీడీపీఓ పద్మావతి పాల్గొని మాట్లాడారు. లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు అమలులో ఉన్నాయని, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాజేష్‌బాబు, అధికారులు మధు, వెంకటేశ్వర్లు, నారాయణ, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్వో ప్రసాద్

సీతారామపురం: వన్యప్రాణులను వేటాడినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని డీఆర్వో కేవీ ప్రసాద్ హెచ్చరించారు. ఆయన మంగళవారం సీతారామపురం మండలంలోని చింతోడు, బోడసిద్దాయపల్లి, గుండుపల్లి గ్రామాల్లో అటవీ వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. అటవీ ప్రాంతంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే స్థానిక ప్రజలు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు గౌతమ్, ఖాజామహ్మద్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పూసలకాలనీలో ప్రత్యేక వైద్యశిబిరం



ఉదయగిరి: పట్టణంలోని పూసలకాలనీలో మంగళవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఎం.శివకల్పన ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కాలనీకి సంబంధించిన యువకుడికి ఇటీవల డెంగీ సోకిన నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 30 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటి సర్వే చేసి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని ప్రజలకు సూచించారు.